క్లుప్తంగా

20న ఆలయ భూముల కౌలు హక్కులకు వేలం

ముదినేపల్లి రూరల్: మండలంలోని సింగరాయపాలెంలోని పలు ఆలయాలకు సంబంధించిన భూములకు ఈ నెల 20న కౌలు హక్కులకు వేలం నిర్వహిస్తామని ఆలయాల గ్రూపు మేనేజర్ శింగనపల్లి శ్రీనివాసరావు తెలిపారు. సింగరాయపాలెంలోని బావాజీమఠానికి చేవూరులో 11.9 ఎకరాలు ఉందని చెప్పారు. ఈ భూములు మూడేళ్ల పాటు లీజుకు ఇచ్చేందుకు 20న మధ్యాహ్నం చేవూరు సచివాలయం వద్ద వేలం నిర్వహిస్తామన్నారు. అదే మఠానికి చెందిన సింగరాయపాలెంలోని 21.08 ఎకరాల భూములకు ఈ నెల 24న మఠం కార్యాలయం వద్ద వేలం జరుగుతుందన్నారు. సింగరాయపాలెం లక్ష్మీనృసింహ స్వామి ఆలయానికి సంబంధించి మండలంలోని సింగరాయపాలెం, వాడవల్లి, చేవూరు, చినపాలపర్రు గ్రామాల్లో 24.58 ఎకరాల భూములున్నాయన్నారు. వీటికి చేవూరు సచివాలయం వద్ద 20న లక్ష్మీనృసింహ ఆలయం వద్ద 20న ఉదయం కౌలు వేలం జరుగుతదని చెప్పారు. సింగరాయపాలెం అమృతేశ్వరస్వామి ఆలయానికి సింగరాయపాలెం, పెదగొన్నూరు, చేవూరు గ్రామాల్లో 39.90 ఎకరాల భూములు ఉండగా వీటికి 20న వేలం దేవదాయశాఖ అధికారుల ఆధ్వర్యంలో వేలం జరుగుతుందన్నారు. ఆసక్తి ఉన్న రైతులు ధరావత్తు చెల్లించి పాటల్లో పాల్గొనవచ్చని చెప్పారు. వివరాలకు 98666 31608 నంబరులో సంప్రదించాలని కోరారు.

వైభవంగా ఆరాధన మహోత్సవాలు



గుడివాడ టౌన్: కాలజ్ఞాన సృష్టికర్త శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి 31వ ఆరాధన మహోత్సవాలు ఘనంగా జరిగాయి. శుక్రవారం స్థానిక శ్రీనివాస సెంటర్‌లోని వీరబ్రహ్మేంద్ర స్వామి వారి దేవస్థానంలో స్వామి వారి ఆరాధనా పూజలు జరిగాయి. జ్వాలాకిరణ్–అనురాధ దంపతులు పూజలు జరిపారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు కాలజ్ఞానాన్ని అందజేసిన వీరబ్రహ్మేంద్ర స్వామి వారిని స్మరించుకుంటూ కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వై.కోటేశ్వరరావు, ఎ. పిచ్చేశ్వరరావు, గోవర్ధనాచారి, తీర్థ నారాయణ, వి. వసంతరాయ్ శర్మ, సీహెచ్ ప్రసాద్, వి.మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతుల అభివృద్ధికి కృషి

ముదినేపల్లి రూరల్: పాడిరైతుల ఆర్థికాభివృద్ధికి కృష్ణా మిల్క్ యూనియన్ కృషి చేస్తున్నట్లు యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. మండలంలోని చిగురుకోట పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాన్ని శుక్రవారం పరిశీలించి రైతులతో మాట్లాడారు. పాల ఉత్పత్తిదారుల సంక్షేమానికి యూనియన్ అనేక సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టిందన్నారు. వీటిలో ప్రధానంగా ప్రతి నాలుగు నెలలకు పది శాతం వంతున బోనస్ పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో పాడిరైతుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. గుడ్లవల్లేరు పాల శీతలీకరణ కేంద్రం మేనేజర్ తోట సత్యనారాయణ, సంఘ అధ్యక్షుడు బొబ్బా వెంకటరత్నం, సూపర్‌వైజర్ జి.గోపిరాజు, సిబ్బంది మురళీబాబు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పమిడిముక్కల: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని హనుమంతపురం, ముళ్లపూడి, వేల్పూరు, ఐనంపూడి, కపిలేశ్వరపురం, వీరంకి, అమీనపురం, మేడూరు, ముత్రాసిపాలెం, గొడపాలెం, ఐనపూరు, కూడేరు, శ్రీరంగపురం, పడమటలంకపల్లి, అప్పారావుపేట, వెట్టివానిగూడెం ఏరియాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని చెప్పారు.

అకాల వర్షం.. మొక్కజొన్న రైతులకు కష్టం



తోట్లవల్లూరు: అకాల వర్షం మొక్కజొన్న రైతులను కష్టాలకు గురి చేస్తోంది. కల్లాల్లో ఆరబెట్టిన మొక్కజొన్నను వర్షం బారినుంచి కాపాడుకోలేక అన్నదాతలు అవస్థలకు గురవుతున్నారు. మండల వ్యాప్తంగా ఈ ఏడాది మొక్కజొన్న పంటను మాగాణి, మెట్ట, లంక భూముల్లో రైతులు విస్తారంగా సాగు చేశారు. పంటకాలం పూర్తి కావటంతో మొక్కజొన్న నూర్పిడిని రైతులు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. దాదాపు ఎనభై శాతం పైగా పంటను రైతులు నూర్పిడి చేసి అమ్ముకున్నారు. మిగిలిన పంటను నూర్పిడి చేసి కల్లాల్లో, రహదారుల వెంట ఆరబెట్టారు. గురువారం మధ్యాహ్నం మొదలైన అకాల వర్షం శుక్రవారం కూడా కురవటంతో మొక్కజొన్న రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షం కారణంగా మొక్కజొన్న పాడైతే తీవ్రంగా నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరదాలు, టార్పాలిన్ పట్టాలను కప్పి మొక్కజొన్నను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు.

ఓటెత్తిన మహిళా చైతన్యం



జుఝువరంలో ఓటు వేసేందుకు బారులు తీరిన మహిళలు (ఫైల్)

- నియోజకవర్గంలో రికార్డు స్థాయిలో 88.11 శాతం పోలింగ్
- మొత్తం ఓటర్లు 1,84,632 పోలైన ఓట్లు 1,62,683
- వైఎస్సార్ సీపీకే అనుకూలమని విశ్లేషకుల అంచనా

పామర్రు: పామర్రు నియోజకవర్గంలో ఈనెల 13వ తేదీన జరిగిన సార్వత్రిక ఎన్నికలు మరోమారు అధికార పార్టీకి పట్టం కట్టనుందా, పోలింగ్ శాతం పెరగడమే ఇందుకు కారణమా? పురుషులతో పోలిస్తే మహిళలు పెద్ద సంఖ్యలో ఓటింగ్‌లో పాల్గొనడం ప్రభుత్వానికి సానుకూలతేనా? మరో మారు వైఎస్సార్ సీపీకి పట్టం కట్టడానికి ఇవి సంకేతాలా? ఈ ప్రశ్నలకు అవును అనే సమాధానాలు వినిపిస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా పామర్రులో పోలింగ్ 88 శాతం దాటడం రికార్డును సృష్టించింది. ఇది ముమ్మాటికి వైఎస్సార్ సీపీ కి అనుకూలమేనని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

పెద్ద సంఖ్యలో ఓటర్లు..

సహజంగా చూసినట్లయితే పోలింగ్ జరిగే సమయంలో ఉదయం 7 నుంచి 11 గంటల వరకు ఓ మోస్తరుగా ఓటర్లు క్యూ కడతారు. దాని తర్వాత సాయంత్రానికి గానీఓటర్లు పోలింగ్ కేంద్రాలకు రారు. అయితే నియోజకవర్గంలో జరిగిన పోలింగ్ ఉదయం నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు కూడా చాలా కేంద్రాల్లో క్యూలు కనిపించాయి. ఇంకా చెప్పాలంటే నియోజకవర్గ కేంద్రంమైన పామర్రు, మండల పరిధిలో జుఝువరం, ఇతర గ్రామాల పరిధిలో ఓటర్లు పెద్ద సంఖ్యలో బారులు తీరారు. పామర్రులో సైతం పలు కేంద్రాల్లో రాత్రి 10 గంటల వరకు పోలింగ్ జరిగింది. జుఝువరం, కురుమద్దాలి తదితర ప్రాంతాల్లో సాయంత్రం 6గంటల వరకు క్యూలలో ఉన్న ఓటర్లు వారి ఓటు హక్కు వినియోగించుకోవడానికి అవకాశం కల్పించారు.

పెరిగిన ఓటింగ్ శాతం

2019 ఎన్నికలతో పోలిస్తే ఈ సారి పోలింగ్ రెండు శాతం పెరిగింది. పామర్రు నియోజకవర్గంలో 88.11 శాతం ఓట్లు పోల్ అయి జిల్లాలో ద్వితీయ స్థానంలో ఉంది. నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 1,84,632 మందిలో పురుషులు 89,422 మంది, మహిళలు 95,207, ఇతరులు ముగ్గురు ఉన్నారు. వీరిలో ఓట్లు వేసిన వారు పురుషులు 79,413 మంది, మహిళలు 83,270 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 1,62,683 ఓట్లు పోలయి 88.11 శాతంగా నమోదు అయింది. నియోకవర్గంలో మహిళలే ఎక్కువ శాతం పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

మరో 20 రోజులు ఆగాల్సిందే..

పోలింగ్ పూర్తవడంతో ఇక ఫలితాలపై సర్వత్రా ఆసక్తి కనిపిస్తోంది. ఫలితాలు వచ్చేనెల 4న వెలువడనున్నాయి. ఫలితాలపై అప్పటి వరకు తీవ్ర ఉత్కంఠ తప్పదు.

2019 ఎన్నికలలో పోలింగ్ సరళి ఇలా	
మొత్తం ఓటర్లు	1,80, 834
మహిళలు	91,878
పురుషులు	88,951
ఇతరులు	5
మొత్తం పోలైన ఓట్లు	1,55,757
మహిళలు	78,878
పురుషులు	76,879
ఇతరులు	0
పోలింగ్‌శాతం	86.11
2024 ఎన్నికలలో..	
మొత్తం ఓటర్లు	1,84,632
మహిళలు	95,207
పురుషులు	89,411
ఇతరులు	3
మొత్తం పోలైన ఓట్లు	1,62,683
మహిళలు	83,270
పురుషులు	79,413
ఇతరులు	0
పోలింగ్ శాతం	88.11

మహిళా ఓటర్లే కీలకం..

పామర్రులో పోలింగ్ శాతం పెరగడంపై సానుకూల అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. అందులోనూ మహిళా ఓటర్లు పోటెత్తడం ఇక్కడి అభ్యర్థి గెలుపులో కీలక పాత్ర పోషిస్తారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కొత్తగా నమోదైన ఓటర్లు, యువత, పురుషులు సైతం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విశ్వసిస్తుండడంతో పాటు పామర్రు లో వైఎస్సార్ సీపీ అభ్యర్థి కైలే అనిల్‌కుమార్ చేసిన అభివృద్ధి కార్యక్రమాలకు అండగా అనేఅభిప్రాయం వ్యక్త మవుతోంది.

జాకీలతో పైకిలేపి ఆలయ పునర్నిర్మాణం

బంటుమిల్లి: కాలం చెల్లిన, నేల మట్టంలో ఉన్న పాత భవంతులు, మందిరాలను పడేసి శిథిలం చేయకుండా జాకీల సాయంతో పైకిలేపి పునర్నిర్మాణం చేస్తున్న సంఘటన బంటుమిల్లి ప్రాంతంలో తొలిసారిగా చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే స్థానిక పోలీసు స్టేషన్ సమీపంలో శ్రీ వీరాంజనేయ ఆలయం నిర్మించి సుమారు 60 సంవత్సరాలు అవుతోంది. కాలాంతరంలో వీధులు మెరక కావడంతో ఆలయం పల్లంగా మారి పూజాది కార్యక్రమాలకు అసౌకర్యంగా ఉంది. ఈ క్రమంలో పాత భవనాలు జాకీల సాయంతో పైకిలేపడం, ఇతర ప్రాంతాలకు తరలించడం తెలుసుకున్న ఆలయ ట్రస్టీ సన్నాల మస్తాన్‌రావు ఒడిశాకు చెందిన కార్మికులను సంప్రదించాడు. ఆలయాన్ని పరిశీలించిన కార్మికులు పని కాంట్రాక్టు ఒప్పందం చేసుకుని ఆలయ పునాదిని కట్ చేసి పైభాగాన్ని జాకీలు, ఐరన్ గడ్డర్లు, చెక్క కమ్ముల సాయంతో పైభాగానికి ఎటువంటి నష్టం జరగకుండా సుమారు నాలుగు అడుగులు ఎత్తు పైకి లేపారు. ఇటువంటి పనులు ఈ ప్రాంతంలో తొలిసారిగా చేపట్టడంతో స్థానికులు వచ్చి ఆసక్తిగా చూసి వెళుతున్నారు. అంతటితో ఆగకుండా స్థానికులు పలువురు వారి పాత భవనాలను పైకి లేపడానికి ఒప్పందం చేసుకున్నట్లు తెలిసింది.



బంటుమిల్లిలో జాకీల సాయంతో పైకి లేపిన ఆంజనేయస్వామి ఆలయం

శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించండి

–కూచిపూడి ఎస్‌ఐ టీ శ్రీనివాస్



కూచిపూడి(మొవ్వ): శాంతి భద్రతతల పరిరక్షణలో ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని కూచిపూడి ఎస్‌ఐ టీ శ్రీనివాస్ కోరారు. శుక్రవారం కూచిపూడి ఎస్‌ఐ ఎన్నికల అనంతరం చెలరేగే హింసపై ముందస్తు హెచ్చరికలను జారీచేశారు. ఎన్నికల కోడ్, 144 సెక్షన్, సెక్షన్ 30 పోలీస్ ఆక్ట్ ఆమల్లో ఉన్నందున నలుగురికి మించి ఒకే ప్రదేశంలో గుమ్మికూడరాదని, అనుమతులు లేకుండా బహిరంగ సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించరాని, ఉద్దేశ పూర్వకంగా పార్టీ అభ్యర్థులను, కార్యకర్తలను రెచ్చకొట్టే విధంగా వ్యాఖ్యలు చేయకూడదని, సోషల్ మీడియాలో తప్పుడు సమాచారం, వదంతులు పెట్టి రెచ్చకొట్టే విధంగా ప్రవర్తించ రాదని సూచించారు. అలా ప్రవర్తించిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రుని ఆరాధన

- వైభవంగా శ్రీగణపతి, శాంతి హోమం
- మూడువేల మందికి పైగా భక్తులకు అన్నసంతర్పణ

నాగాయలంక: స్థానిక కృష్ణానది తీరంలోని శ్రీవిశ్వేశ్వరస్వామి సహిత శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో శుక్రవారం స్వామివారి 331వ ఆరాధనోత్సవం, ఆలయ 18వ వార్షిక వేడుక ఘనంగా నిర్వహించారు. కాల/జ్ఞానకర్త, సంఘ సంస్కర్త శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి జీవ సమాధి పొందిన పవిత్ర పర్వదినం వైశాఖ శుద్ధ దశమి పురస్కరించుకుని ఆలయ కమిటీ చైర్మన్ భవిరి సుధాకర్ పర్యవేక్షణలో అర్చకుడు మహేశ్వరపు శ్రీనివాసగాంధీ నేతృత్వంలో తొలుత స్వామివారి ఆరాధనోత్సవ విశేషపూజ అనంతరం గణపతి హోమం, శాంతిహోమం నిర్వహించి, పీటలపై కూర్చున్న దంపతులతో పూర్ణాహుతి సమర్పించారు. ఉత్సవం పురస్కరించుకుని దాతలుగా రిటైర్డ్ ఎంఈఓ భవిరి శంకరనాథ్–మల్లేశ్వరి దంపతులు ఆలయంలో స్వామికి మకరతోరణాన్ని, మద్ది నాగ వెంకట సాయికుమార్–రాజ్యలక్ష్మి (హైదరాబాద్) దంపతులు విశ్వేశ్వరస్వామికి వెండి ధారాపాత్రను, భవిరి రవి శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామి విగ్రహాన్ని బహూకరించారు. దాతలు, ఆలయ కమిటీ ఆర్థిక సహకారంతో మూడు వేల మంది భక్తులకు ఆరాధన ఉత్సవంలో ప్రధానమైన అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో హాజరై ఆరాధనోత్సవం తిలకించారు.



ఆలయంలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన క్రతువులో విశేషపూజలు చేస్తున్న దంపతులు

నేడు రేణుక అంకమ్మ తల్లి సంబరాలు



పమిడిముక్కల: మండలంలోని హనుమంతపురం గ్రామంలో శని, ఆది వారాల్లో శౌంతి వంశస్తుల ఇలవేల్పు రేణుక అంకమ్మతల్లి సంబరాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ వారు తెలిపారు. శనివారం అమ్మవారి గ్రామోత్సవం, ఆదివారం అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కుబడులు తీర్చుకొంటారని తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చే శౌంతి కుటుంబీకులకు ఆలయం వద్ద అల్పాహారం, భోజన వసతి ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు.

భక్తిప్రపత్తులతో గ్రామ బలిహరణ

కోడూరు: మండలంలోని లింగారెడ్డిపాలెం బాలాత్రిపుర సుందరీ సమేత గోకర్ణేశ్వరస్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం గ్రామ బలిహరణను భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ప్రత్యేక పల్లకిలో బలిహరణ స్వామిని గ్రామంలో ఊరేగించారు. ఉదయం లింగాకారుడికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకాలు, పంచామృతాభిషేకాలను నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ హోమలను జరిపారు. బాలాత్రిపుర సుందరీ అమ్మవారికి సామూహిక కుంకుమార్చనను నిర్వహించి, ప్రత్యేక అలంకారంలో తీర్చిదిద్దారు. శనివారం రాత్రికి స్వామివార్ల కల్యాణాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ సుధాకర్ తెలిపారు. కల్యాణం తిలకించేందుకు వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు, నాటకాల ప్రదర్శనలు ఉంటాయని ఈఓ తెలిపారు.



ప్రత్యేక అలంకారంలో రాజ్యలక్ష్మి అమ్మవారు

భక్తిశ్రద్ధలతో హనుమాన్‌చాలీసా పారాయణ

బంటుమిల్లి: పాశ్చాపురం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ సువర్చలాంజనేయస్వామి ఆలయంలో జరుగుతున్న శ్రీ హనుమాన్‌చాలీసా పారాయణ శుక్రవారం నాటికి 31వ రోజుకు చేరుకుంది. వార్షికంగా శ్రీరామ నవమి నుంచి హనుమజ్జయంతి వరకు దాదాపు 40 రోజులకు పైగా భక్తులతో చాలీసా పారాయణ నిర్వహిస్తారు. ఇందులో భాగంగా గత నెల 17వ తేదీ నుంచి మొదలైన పారాయణ జూన్ ఒకటో తేదీ వరకు జరగనుంది. ఉదయం ఆరు నుంచి ఎనిమిది గంటల వరకు జరుగుతున్న పారాయణ కార్యక్రమంలో పలు గ్రామాల నుంచి భక్తులు ఆటోల్లో తరలి వచ్చి పెద్ద ఎత్తున పాల్గొంటున్నారు.



29 నుంచి వేసవి విజ్ఞాన శిబిరాలు

మండవల్లి: మండవల్లి గ్రంథాలయంలో ఈ నెల 29 నుంచి జూన్ 7 వరకు వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహించనున్నట్లు గ్రంథాలయ అధికారి షేక్ పర్వీన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజ్ఞాన శిబిరంలో ప్రతిరోజు పుస్తక పఠనం, పుస్తక సమీక్ష, డ్రాయింగ్, కథలు, పేపర్ వంటి వంటి వివిధ అంశాల్లో అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. చెస్, క్విజ్, జనరల్ నాలెడ్జ్, స్పోకెన్ ఇంగ్లిష్ వంటి అంశాలు నేర్పిస్తారని, ఈ కార్యక్రమాల్లో విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని, సద్వినియోగం చేసుకోవాలన్నారు.

యువకులు రక్తదానం చేయాలి

గుడివాడ టౌన్: రక్తదానం చేసి ప్రాణదాతలవ్వాలని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు మాచర్ల రామకృష్ణ (ఆర్‌కే) అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో గంటా సుబ్రహ్మణ్య శాస్త్రి చికిత్స నిమిత్తం రక్తం అవసరం కాగా యువకుడు మెండా కిరణ్ రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆర్‌కే మాట్లాడుతూ రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలన్నారు. సకాలంలో రక్తం అందక ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని స్వచ్ఛందంగా రక్తదానం చేసి ప్రాణ దాతలు కావాలని ఆయన కోరారు.



నేడు అమ్మవారి జన్మదిన మహోత్సవం

గుడివాడ టౌన్: స్థానిక వాసవిచౌక్‌లో శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి 4,641వ జన్మదిన వేడుకలు జయప్రదం చేయాలని ఆలయ పాలకవర్గ సభ్యులు కోరారు. శుక్రవారం ఆలయ కార్యాలయంలో మహోత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శనివారం అమ్మవారి జన్మదిన వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 5 గంటలకు 108 కలశాలతో అమ్మవారికి అభిషేకాలు, 8 గంటలకు పట్టుచీర సమర్పణ అనంతరం 102 మంది బాలకన్యకలకు విశేష పూజలు, 10 గంటలకు 108 మంది సుహాసినిలతో సహస్ర పుష్పార్చన కార్యక్రమాలు ఉంటాయన్నారు. కేసరపల్లికి చెందిన కమలానంద భారతి స్వామి వారి ప్రవచనం కార్యక్రమం ఉంటుందన్నారు. 12 గంటలకు పెద్ద సంఖ్యలో అన్నసమారాధన నిర్వహిస్తున్నామన్నారు. సాయంత్రం 5 గంటలకు మేళతాళాలు, చండీమేళం, శక్తి వేషాలు, తీన్మార్, డప్పు వాయిద్యాల నడుమ అమ్మవారి నగర సంకీర్తన జరుగుతుంది. ఆలయ అధ్యక్షుడు జవ్వాజి గంగరాజు, అదనపు కార్యదర్శి సముద్రాల వెంకట జగ్గారావు, కోశాధికారి టంగుటూరి వెంకట సుబ్బారావు, ఎక్కల మణిదీప్, ఎండూరి బాలాజీ, కూరెళ్ల శ్యామ్‌సుందర్, తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్‌లు ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

వేణుగోపాలుని కల్యాణోత్సవాలు ప్రారంభం

తోట్లవల్లూరు: స్థానిక శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి దివ్య తిరు కల్యాణ మహోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ నెల 25 వరకు స్వామి కల్యాణోత్సవాలు జరగనున్నట్లు ఆలయ ఈఓ హరి దుర్గా నాగేశ్వరరావు తెలియజేశారు. 17న స్వామి వారిని పెండ్లి కుమారుని అలంకరణ, 18న రుక్మిణీ, సత్యభామ అమ్మవార్లను పెండ్లి కుమార్తెల అలంకరణ, 19న విష్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, అంకురార్పణ, ధ్వజారోహణం, 20న నిత్యహోమం, బలిహరణ, 21న జాతీయ బంగారు నంది పురస్కార గ్రహీత సప్పా భారతి భాగవతారిణిచే హరికథా కాలక్షేపం, 22 రాత్రి 8 గంటలకు స్వామి వారి కల్యాణ మహోత్సవం, 23న రథోత్సవం, 24న ధ్వజావరోహణం, రాత్రి 7 గంటలకు లక్ష మల్లెల పూజ, 25న ద్వాదశ ప్రదక్షిణలు, పవళింపు సేవ, ఉదయం 11 గంటలకు అన్నసమారాధన ఉంటుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఈఓ తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.



తోట్లవల్లూరులోని వేణుగోపాలస్వామి ఆలయం

వాసవీమాత పాహిమాం.. పాహిమాం

కైకలూరు: వాసవీ కన్యకాపరమేశ్వరి పాహిమాం.. పాహిమాం అంటూ భక్తులు అమ్మవారిని ఆరాధించారు. కైకలూరు శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ 44వ వార్షిక జన్మదిన మహోత్సవాలు అత్యంత ఘనంగా జరుగుతున్నాయి. అమ్మవారి ఉత్సవ విగ్రహానికి అభిషేకాలు నిర్వహించారు. పెద్ద ఎత్తున మహిళలు అమ్మవారికి పూజలు చేశారు. స్థానిక కన్యకా పరమేశ్వరీ ఆర్యవైశ్య సేవా సంఘం అధ్యక్షుడు చొప్పర్ల మురళీకృష్ణ మాట్లాడుతూ ఈ నెల 18 వ తేదీ వరకు అమ్మవారి జయంత్యుత్సవాలు నిర్వహిస్తామన్నారు. శనివారం కలశ స్థాపన, 102 మంది ఆర్యవైశ్య ముత్తయిదువులచే సహస్రనామార్చాన, కుంకుమార్చన, మధ్యాహ్నం 12 గంటలకు ఆర్యవైశ్య సంఘీయులకు ప్రసాద వితరణ ఉంటుందన్నారు. అమ్మవారి జన్మదినం సందర్భంగా ఆర్యవైశ్యులు సంక్రాంతి, దీపావళి పండుగుల మాదిరిగా దీపాలు, తోరణాలు కట్టుకుని అమ్మవారిని ఆరాధించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి కొప్పర్తి గోపాల కృష్ణమూర్తి, కోశాధికారి సమయమంతుల వీఎస్ఎస్ బసవరాజు తదితరులు పాల్గొన్నారు.



కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో మహిళల పూజలు

కార్మిక సంక్షేమ చట్టాలు అమలు చేయాలి

గుడివాడ టౌన్: అసంఘటిత రంగ కార్మిక సంక్షేమ చట్టాలు అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి టి.తాతయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఏలూరు రోడ్‌లోని సీపీఐ కార్యాలయంలో నియోజకవర్గ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోట్లాది మంది అసంఘటిత కార్మికులు ఏ విధమైన సంక్షేమ చట్టాలు అమలుకు నోచుకోలేదన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కొరకు జూలై 27, 28 తేదీల్లో కృష్ణా జిల్లా 12వ ఏఐటీయూసీ మహాసభలు గుడివాడలో నిర్వహిస్తున్నామన్నారు. కార్మికులు మహాసభలలో పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు డి. నరసింహారావు, జి.ప్రకాష్‌బాబు, సీహెచ్ సత్యన్నారాయణ, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తాతయ్య

భక్తులకు మజ్జిగ పంపిణీ



గుడివాడ టౌన్: మానవతా స్వచ్ఛంధ సేవా సంస్థ సేవా కార్యక్రమాలలో భాగంగా శుక్రవారం స్థానిక వాసవిచౌక్ సెంటర్ లోని కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం వద్ద మజ్జిగ పంపిణీ చేశారు. భక్తుల సౌకర్యార్థం, బాటసారులకు ఈ పంపిణీ జరిగిందని, సేవాసంస్థ సభ్యులు దేవులపల్లి లక్ష్మీ నరసింహమూర్తి – కమలకుమారిల సౌజన్యంతో పంపిణీ జరిగినట్లు అధ్యక్షురాలు దండమూడి జయలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పీవీ శేషగిరిరావు, డైరక్టర్ దండమూడి సీతారామస్వామి, తాతా రజినీ కుమారి, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఈఏపీసెట్

పెదన: మండలంలోని నందమూరు శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం జరిగిన ఈఏపీసెట్ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ బీఎస్ఎన్ రెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలకు వరకు జరిగిన మొదటి సెషన్స్‌లో 90 మందికి 80 మంది హాజరయ్యారని, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరిగిన రెండో సెషన్స్‌లో 90 మందికి 84 మంది హాజరయ్యారని తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా జరిగిందని ఆయన పేర్కొన్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు



తోట్లవల్లూరు: వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు తోట్లవల్లూరు ఎస్‌ఐ పి.విశ్వనాథ్ తెలియజేశారు. మండలంలోని గరికపర్రుకు చెందిన ఈడే నాగిని (24) శుక్రవారం ఉదయం 10 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. గ్రామంలో, బంధువుల నివాసాల వద్ద ఎంత ప్రయత్నించినా ఆమె ఆచూకీ లభించలేదు. భర్త ఈడే శ్రీనివాసరావు ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విశ్వనాథ్ తెలిపారు.